క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొవ్వూరు: దేచెర్ల 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ వరకు విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. వార్షిక తనిఖీలు, నిర్వహణ పనుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఐ.పంగిడి ఇండస్ట్రీరియల్, 11కేవీ, దేచెర్ల 11కేవీ, లోకల్, ధర్మవరం 11కేవీ ఫీడర్లలోని గ్రామాలకు కరెంట్‌ను నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు



రైతులకు విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్

తాళ్లపూడి: రైతులు సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు పొందవచ్చని సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు అన్నారు. వేగేశ్వరపురంలో గురువారం సచివాలయం వద్ద సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎరువులు, పరుగు మందులు వాడకుండా సహజ సిద్ధంగా పంటలు సాగు చేయాలన్నారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, సేంద్రియ వ్యసాయ సిబ్బంది వల్లీ, డి.భీష్మాంబ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

తాళ్లపూడి: కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న వేగేశ్వరపురానికి చెందిన శూలా నాగరాజుకు వైద్య ఖర్చులకు మండల మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. మానవత అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు, ఇతర సభ్యుల చేతులు మీదుగా రూ.8500 అందించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సాయన సుబ్బారావు, డాక్టర్ అన్నపూర్ణ, వి చంద్రయ్య, జంగా లక్ష్మిపతి, అంకెం సురేష్, అప్పన చంద్ర గుప్త, సనపల రాజశేఖర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన డీఈవో



బల్లిపాడు జేబీ స్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అబ్రహం

తాళ్లపూడి: పదో తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం గురువారం పరిశీలించారు. మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రంలో సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బల్లిపాడు జూనియర్ బేసిక్ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయుడు రాముకు సూచించారు.

నిడదవోలు రూరల్: పదో తరగతి విద్యార్థులకు గురువారం నిర్వహించిన హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈఓ కిషోర్‌కుమార్ తెలిపారు. నిడదవోలు పరిధిలో ఉన్న 9 పరీక్ష కేంద్రాల్లో 1426 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 1404 మంది హాజరయ్యారు. మిగిలిన 22 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్టు ఆయన పేర్కొన్నారు.

కన్నుల పండువగా సీతారాముల పట్టాభిషేకం

కొవ్వూరు: పట్టణంలోని గౌతమీనగర్ పురుషోత్తమ రామమందిరంలో గురువారం సీతారాముల పట్టాభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు. ఆంధ్రా సుగర్స్ భద్రతాధికారి కరుటూరి వీర వెంకట సత్యనారాయణమూర్తి, శ్రీ వెంకట సూర్యలక్ష్మిల చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జీబీవీ సుబ్రహ్మణ్యం రామాయణంలోని పట్టాభిషేకం ఘట్టంపై ప్రవచనం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మండల సచివాలయాల కన్వీనర్‌గా చిన్ని

ద్వారకాతిరుమల: మండల సచివాలయాల కన్వీనర్‌గా తిరుమలంపాలెంకు చెందిన భోగరాజు సాయికృష్ణ (చిన్న చిన్ని)ని గురువారం నియమించినట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను చిన్ని ఘనంగా సత్కరించి, పూల బొకేను అందజేశారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చిన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్ భాషా, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి తదితరులున్నారు.

రబీ వరి కోతలు ప్రారంభం

- యంత్రాలతో పనులు
- ఖర్చు ఆదా అవుతుందన్న రైతులు
- నియోజకవర్గంలో 36,500 ఎకరాల్లో సాగు



ఉసులుమర్రులో యంత్రంతో వరికోత

పెరవలి: రబీ పంట తుది దశకు చేరుకుంది. ముందుగా సాగుచేసిన పొలాల్లో వరికోతలు ప్రారంభమయ్యాయి. మరో వారం రోజుల్లో దాళ్వా తుది దశ పనులు ముమ్మరం కానున్నాయి. ఈ ఏడాది నిడదవోలు నియోజకవర్గంలో 36,500 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. అందులో పెరవలి మండలంలో 8,500 ఎకరాలల్లో, ఉండ్రాజవరంలో 11,500, నిడదవోలు మండలంలో 16,500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. విత్తన పంటగా సుమారు 2 వేల ఎకరాల్లో సాగు చేపట్టారు. ముందస్తుగా నాట్లు వేసిన చేలు కోతలు జరుగుతుండగా, ఆలస్యంగా నాట్లు వేసిన చేలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. విత్తనసాగుకు పేరు పొందిన ఉసులుమర్రు, తీపర్రు, కానూరు అగ్రహారం, నడుపల్లి గ్రామాల్లో వరిచేలు కోతకు సిద్ధమయ్యాయని రైతులు చెబుతున్నారు.

అనుకూలించిన వాతావరణం

వాతావరణం అనుకూలించడంతో వరిసాగు సజావుగా సాగింది. ప్రస్తుతం ఈనిక దశలో ఉంది. తెగుళ్ల ప్రభావం కూడా అంతగా లేదు. ప్రస్తుతం ఉసులుమర్రులో వరికోత యంత్రాలతో కోతలు చేపట్టారు. పంటని ఒబ్బిడి చేసుకునేందుకు ధాన్యాన్ని రోడ్డుపైకి తీసుకువచ్చి ఆరబెడుతున్నారు. యంత్రాల వలన కోత కోయనవసరం లేకుండా ధాన్యం ఎగరబోత, కుప్పనూర్పు వంటివి అవసరం లేకుండానే ఎప్పటికప్పుడు కోత కోసిన ధాన్యాన్ని గట్టుపైకి తీసుకువస్తుందని రైతులు చెబుతున్నారు. ఖర్చు తగ్గడంతో పాటు కోసిన పంట ఎప్పటికప్పుడు ఒబ్బిడి అవుతుందని రైతులు చెబుతున్నారు.

తగ్గిన ఖర్చు

రైతులు యంత్రాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ పని జరుగుతుంది. అలాగే ఖర్చుకూడా తగ్గుతుంది. వరి కోతలకు కూలీలను పెడితే కోతలు, కుప్పనూర్పు, ధాన్యం ఎగరబోత వంటివి చేయడానికి సుమారు రూ.10వేల వరకు ఖర్చు అవుతుంది. అదే వరికోత యంత్రాలతో మాసూళ్లు చేసుకుంటే సుమారు రూ.3500 వరకూ ఖర్చు తగ్గుతుందని రైతులు వివరిస్తున్నారు. ప్రస్తుతం దిగుబడి 45 నుంచి 55 బస్తాల వరకు రకాన్ని బట్టి వస్తున్నాయని రైతులు జన్ని ఆంజనేయులు, వీరమళ్ళ శ్రీనివాస్ తెలిపారు.



వరికోత అనంతరం ధాన్యాన్ని రోడ్డుపై ఎండబెడుతున్న రైతులు

గడప గడపకూ నిధులతో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం



దేవరపల్లిలో సిమెంట్ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి: గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టినట్టు ఎంపీపీ కేవీకే దుర్గారావు తెలిపారు. గ్రామంలో చంద్రబాబు కాలనీలో సుమారు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును గురువారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ చంద్రబాబు కాలనీ ఏర్పడి దాదాపు 20 ఏళ్లు కావస్తున్నా ఇంత వరకు రోడ్లు నిర్మాణం జరగలేదన్నారు. గత ప్రభుత్వం గ్రామంలోని చంద్రబాబు, ఇందిరమ్మ కాలనీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆయన విమర్శించారు. రెండు కాలనీల్లో దాదాపు 600 కుటుంబాలు ఉంటున్నాయని, ఆ కాలనీల్లో సీసీ, గ్రావెల్ రోడ్లు, డ్రైన్లు, మంచినీటి పథకం, బోరు, పైపులైన్లు నిర్మిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వెంకట్రావు గడపగడపకూ కార్యక్రమంలో భాగంగా కాలనీకి వచ్చినప్పుడు ఈ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి పరిష్కరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు దుగ్గిన గంగాధర్, సొసైటీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, పంచాయతీ సభ్యుడు పత్సా రాంగోపాల్, కామిశెట్టి దుర్గారావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పట్టణంలో క్రీడా పోటీలు ప్రారంభం

నిడదవోలు రూరల్: నిడదవోలులో పూలే, అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బీవీఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత బయ్యే చంద్రకుమార్ క్రీడాపోటీలను గురువారం ప్రారంభించారు. పట్టణంలోని సంత మార్కెట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వాలీబాల్, క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు జువ్వల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కీరవాణికి పద్మశ్రీ ఇవ్వడం హర్షణీయం

కొవ్వూరు: సినీ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణికి పద్మశ్రీ అవార్డు ఇవ్వడం హర్షణీయమని సినీ నటుడు డాక్టర్ రామతీర్థ హర్షం వ్యక్తం చేశారు. ఆర్ఆర్ఆర్ సినిమాకి ఆస్కార్ అవార్డు దక్కించుకున్న కీరవాణి ప్రతిభను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీకి ఎంపిక చేసింద న్నారు. తెలుగు ప్రజలు, చిత్ర పరిశ్రమ తరుపున కీరవాణికి అభినందనలు తెలియజేస్తున్నానని రామతీర్థ అన్నారు. కీరవాణి సంగీత దర్శకత్వం వహించిన అన్నమయ్య, శ్రీరామదాసు, ఓ నమో వెంకటేశ, పాండురంగడు వంటి సినిమాల్లో నటించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు.

ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



ఆలయ కమిటీ చైర్మన్ తలంశెట్టి మాధవరావును సత్కరిస్తున్న గ్రామపెద్దలు

నల్లజర్ల: ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని చీపురుగూడె రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ తలంశెట్టి మాధవరావు అన్నారు. చీపురుగూడెంలోని రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని గురువారం రాత్రి అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ తలంశెట్టి మాధవరావు ఆలయ అభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందిస్తూ గ్రామస్తులు పట్టు వస్త్రాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. జరిగిన అన్నదానంలో 1500 భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో చెల్లు శ్రీహరి, గాలింకి రాంబాబు, తలంశెట్టి సత్యనారాయణ, సాయిబాబా, హరిబాబు, గుండాబత్తుల రాజారావు, తలంశెట్టి కోటేశ్వరావు, రాచగర్ల రామారావు, గంగారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

నిడదవోలు రూరల్: శ్రీరామనవమి ముగింపు వేడుకల్లో భాగంగా ఉనకరమిల్లిలో గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సీతారామచంద్ర స్వామిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగ్గురు యువకులపై కేసు

కొవ్వూరు: వాడపల్లి గ్రామంలో బుధవారం రాత్రి బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఊరేగింపులో పాత కక్షల నేపథ్యంలో ఆ గ్రామనికి చెందిన యువకుడు వడ్డీ కిషోర్‌ను ముగ్గురు యువకులు బన్ను, ముప్పిడి సురేష్, ఆరుగోలను పండు కొట్టి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబూరావు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలు



ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న వైవీవీఎస్ కుమార్, ఎండీ గౌస్

కొవ్వూరు: గడచిన ఆర్థిక సంవత్సరంలో ఆర్టీసీ సంస్థకు అధిక ఆదాయం సమకూర్చడంలో ప్రతిభ చూపిన ఉద్యోగులను ప్రశంసించారు. ఉత్తమ కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లను ఎంపిక చేసి సేవా పురస్కారాలు అందించినట్టు కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. గురువారం డిపో గ్యారేజీలో నిర్వహించిన సమావేశంలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ఉప ఖజానాధికారి ఎండీ గౌస్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశామన్నారు. డ్రైవర్లలో వైడీ రావు, పీపీహెచ్‌రావు, జె.డేవిడ్, జీఎస్ రావు, పి.శేఖర్, కె.నాగేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, పీకే డీపీ రావు, వీకేఎం స్వామి, ఎం.రాంబాబు ఎంపికయ్యారు. కండక్టర్లలో ఎండీ రఫీయుల్లా, జేవీవీఎస్‌కే కుమార్, ఎంఎస్‌రావు, కేఎస్ మన్యం, ఎ.అచ్యుతరావు, ఎ.రాజు, జీబీఎస్ నారాయణ, ఎస్‌వీఎస్ రావు, ఎంవీ రాజు, ఎస్‌కే భాషాలతోపాటు మెకానిక్స్ విభాగంలో పీవీవీ రమణబాబు, పి.రవితేజ, ఎస్‌వీవీ ఎస్ఎన్ మూర్తి, కేఎస్ భాషాలను ఎంపికైనట్టు డిపో మేనేజర్ తెలిపారు.

ఆర్టీసీ డిపోకు ఫస్ట్ ఎయిడ్ కిట్ల అందజేత

కొవ్వూరు: స్థానిక ఆర్టీసీ డిపోకు లయన్స్ క్లబ్ ఆర్థిక సాయంతో సమకూర్చిన 50 ఫస్ట్ ఎయిడ్ కిట్లను గురువారం డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్‌కు క్లబ్ అధ్యక్షుడు కంఠమణి రామకిషోర్ అందజేశారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రమాద సమయంలో గాయపడిన ప్రయాణికులకు ప్రాథమిక చికిత్స అందించడానికి గాను రూ.20వేలు విలువైన కిట్లను అందించారు. క్లబ్ ఉపాధ్యక్షుడు కలగర వెంకట్రావు, మహ్మద్ హుస్సేన్, మన్యం బులిబాబు, యనమదల వెంకట సుబ్రహ్మణ్యం, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

దేవరపల్లి: ధుమంతునిగూడెంలో గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రాపాక వినయ్ కుటుంబం నారాశ్రయులయ్యారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సుమారు రూ.2.50 లక్షలు ఆస్తి నష్టం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు సత్తి జగదీశ్వరరెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కృష్ణంపాలెంలోని వయోవృద్ధుల ఆశ్రమం నిర్వాహకురాలు జి.శ్యామలాదేవి బాధిత కుటుంబ సభ్యులకు వస్త్రాలు అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



వ్యక్తి మృతదేహం

కొవ్వూరు: పట్టణంలో గోదావరి మాత విగ్రహం ఎదురుగా ఉన్న సీతారామ స్నాన ఘట్టం వద్ద గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గురువారం సాయంత్రం గుర్తించారు. అతనికి సుమారు 60 ఏళ్లు ఉంటాయి. అతని పక్కనే పురుగుమందు, థమ్స్‌అప్ బొటిళ్లు ఉన్నాయి. వీఆర్వో టి.శేషారత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించామని పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు. వివరాల కోసం పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. మృతుడు ఆత్మహత్యచేసుకొని ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. సంఘటన స్థలంలో ఏవిధమైన ఆధారాలు లభ్యం కాలేదని ఎస్సై తెలిపారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

కొవ్వూరు: భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవం గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ జంక్షన్, రాజీవ్ కాలనీల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు బీవీ ముత్యాలరావు, రూరల్ కార్యాలయం వద్ద మండల శాఖ అధ్యక్షుడు పెరుగు పోతురాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కి నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ, నియోజకవర్గ కన్వీనర్ మట్లా వీరాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

నల్లజర్ల: బీజేపీ ఆవిర్భావ దినోత్సవవాన్ని చీపురుగూడెంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యాక్షులు శెట్టిపల్లి శివనాగరాజు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు చెల్లు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, పెదబుజ్జి, సతీష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిడదవోలు పట్టణ, మండల నాయకుల ఆధ్వర్యంలో సమిశ్రగూడెంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గణపతి సెంటర్‌లో బీజేపీ స్థూపం వద్ద ఆ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకర నరసింహం బీజేపీ జెండా ఎగురవేశారు. నియోజకవర్గ కన్వీనర్ బండి సత్యనారాయణ మాట్లాడుతూ రానున్న 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాట్ల దుర్గారావు, కట్టుంగ అచ్చియ్య, పి.రాఘవులు, మల్లాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో గురువారం సాయంత్రం క్వారీ లారీ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఊబా గమ్మానియేలు సైకిల్‌పై నిడదవోలు–ఐ.పంగిడి రహదారిపై వెళుతుండగా క్వారీ లారీ ఢీకొట్టింది. గమ్మానియేలు రెండుకాళ్లకు తీవ్రగాయాలు కావడంతో 108లో ఆసుపత్రికి తరలించారు. ఆయన మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు చేస్తున్న ఆర్డీవో మల్లిబాబు, ఐసీడీఎస్ పీడీ విజయకుమారి

కొవ్వూరు: డివిజన్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులకు గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆర్డీవో ఎస్.మల్లిబాబు అధ్యక్షతన ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారిల ఆధ్వర్యంలో ఉన్న కమిటీ సభ్యులు అభ్యర్థులకు ఇంటర్వ్యూ చేశారు. 32 ఆయా పోస్టులకు గాను 106 దరఖాస్తులు అందగా వీరిలో 97 మందికి అర్హత ఉన్నట్టు లెక్క తెల్చారు. వీరిలో 95 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. పెరవలి ప్రాజెక్టులో ఒక కార్యకర్త పోస్టుకి ఐదుగురు ఇంటర్వ్యూకి హాజరయ్యారు. గోపాలపురంలో నాలుగు, కొవ్వూరులో ఆరు, పోలవరంలో ఒకటి, పెరవలి, నల్లజర్ల సమిశ్రగూడెం ప్రాజెక్టుల పరిధిలో ఏడేసి చొప్పున ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించామని పీడీ విజయకుమారి తెలిపారు. సీడీపీవోలు డి.మమ్మి, వైబీటీ సుందరి, ఎం.ఆశారోహిణి, ఎం.శ్రీలక్ష్మి, వైద్యురాలు ఎ.మౌనికలు ఇంటర్వ్యూలు నిర్వహించిన టీంలో ఉన్నారు.

ఆరోగ్యాంధ్ర ప్రదేశే ప్రభుత్వ లక్ష్యం



అన్నవరప్పాడులో 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్



మోర్తలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి

పెరవలి: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టారని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తెలిపారు. మండలంలోని అన్నవరప్పాడులో గురువారం 104 వాహనాన్ని, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేదలకూ ఫ్యామిలీ డాక్టర్ ఉండాలనే ఉద్దేశంతో సీఎం జగన్ ఇంటి ముంగిటకే వైద్య సేవలు తీసుకువచ్చారన్నారు. ఆరోగ్యం పరంగా ఆర్థిక భారం ఉండకూడదని, పేదలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వెంటనే పరీక్షలు చేసి తగిన మందులు ఇస్తారని తెలిపారు. దీనివల్ల గ్రామాలు ఆరోగ్యం ఉంటాయన్నారు. పంతం బాల సుందరి, పంతం చిన్న, కోటిపల్లి గంగన్న వైద్యాధికారి విజయ్ కుమార్ వైద్య సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: పేదల ఇంటి వద్దకే వైద్యం అందించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా మండలంలో మోర్త సచివాలయం–1లో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ఆమె ప్రారంభించారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యురాలు ఉషారాణి మాట్లాడుతూ గ్రామాల్లో అందరికీ వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందుతాయన్నారు. ముందుగా పరీక్షల చేయు విభాగాలను సర్పంచ్ చిటికెన సుజిని, 104 వాహన సేవల విభాగాలను వైస్ ప్రెసిడెంట్ దాపర్తి సందీప్, ఓపీ సేవలను ఎంపీటీసీ సభ్యురాలు జాని నాగలక్ష్మి, వి.రాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిటికెన సూర్యనారాయణ, కార్యదర్శి ఎం.రాంప్రసాద్, సీహెచ్‌ఓ సుబ్రహ్మణ్యం, జె.శ్రీనివాసరావు, డి.ఇందిర, కె.రోజా, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

నిడదవోలు రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఆరోగ్య భరోసా కల్పిస్తోందని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. పెండ్యాల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని, కొత్త 104 వాహనాన్ని గురువారం ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రజలు ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, సర్పంచ్ కారింకి అన్నవరం, ఉపసర్పంచ్ బైర్రాజు సత్యరాజు, ఎంపీటీసీ వాకా శ్రీను, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దుర్గారావు కుటుంబానికి అండగా ఉంటాం



దుర్గారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హోమ్ మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఐ.పంగిడి వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ తోట దుర్గారావు కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత ప్రకటించారు. గురువారం ఐ.పంగిడిలో దుర్గారావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దుర్గారావు మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ జిల్లా యువ జన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, నాయకుడు ఉప్పులూరి సూరిబాబు, ముదునూరి నాగరాజు, ఉప్పులూరి నానాజీ, ముదునూరి నాగరాజు, సర్పంచ్ గోశాల నాగర్జున తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌పై సందేహాల నివృత్తి

- పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన
- రాత పూర్వకంగా అభ్యంతరాలు ఇవ్వాలని సూచన



కొవ్వూరులో మాస్టర్ ప్లాన్‌పై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

కొవ్వూరు: పట్టణంలో పెరగుతున్న జనాభా, ప్రజల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన మాస్టర్ ప్లాన్‌పై గురువారం మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనర్ బి.శ్రీకాంత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏయే రోడ్డు మార్గాలు, చోటు చేసుకునే మార్పులు, జోన్ల ఏర్పాటు వంటి అంశాలపై మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదనల వివరాలు వెల్లడించారు. అనంతరం కౌన్సిలర్లు, పట్టణ వాసులు అడిగిన సందేహాలను నివృతి చేశారు. 2041 నాటికి పట్టణ అవసరాలను పరిగణనలోకి తీసుకుని కొవ్వూరు పట్టణానికి పరిసర ప్రాంతాల్లో ఉన్న చాగల్లు, వాడపల్లి, తొగుమ్మి, నందమూరు, వేములూరు, ఆరికిరేవుల, దొమ్మేరు, పశివేదల వంటి గ్రామాలను కలుపుతూ ప్రణాళికలో పొందుపరిచినట్టు కమిషనర్ వివరించారు. దీనిపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలుంటే రాతపూర్వకంగా అందజేయాలని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్‌పర్సన్ మన్నె పద్మ, టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.